సాక్షి

పశ్చిమగోదావరి

శనివారం । 15 । ఫిబ్రవరి । 2025



అమ్మకు మహా నివేదన

భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మ వారి ప్రసాదాన్ని స్వీకరించారు. 8లో ▸



పెనుగొండలో ఆధ్యాత్మిక శోభ

ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం పెనుగొండ క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. 8లో ▸



పట్టిసం ఉత్సవాలకు ఏర్పాట్లు

పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. 8లో ▸

షాడో ఎమ్మెల్యేలు

జీ హుజూర్ అనాల్సిందే !

- పాలనలో చక్రం తిప్పుతున్న వైనం
- ఎమ్మెల్యేల కుటుంబసభ్యులు, అనుచరులదే పెత్తనం
- సెటిల్‌మెంట్లు, పైరవీల్లో వారిదే హవా
- అధికార యంత్రాంగమూ వారి చెప్పుచేతల్లోనే..
- షాడోల తీరుపై మిత్రపక్ష నేతల్లో అసంతృప్తి



సాక్షి, భీమవరం: తనయులు.. తమ్ముళ్లు.. అనుయాయులే.. ఎమ్మెల్యేలుగా చక్రం తిప్పుతున్నారు. అధికార యంత్రాంగాన్ని చెప్పుచేతల్లో పెట్టుకుని పాలనలో అన్నీతామై వ్యవహరిస్తున్నారు. సెటిల్‌మెంట్లు, పైరవీలు, పర్సంటేజీలు అన్నింటిలోనూ వారు చెప్పిందే ఫైనల్. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. మరోపక్క కూటమిగా అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తే తమకు గుర్తింపు లేదన్న అసంతృప్తిలో మిత్రపక్ష నేతలు ఉన్నారు.

సెటిల్‌మెంట్లలో దిట్టలు

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల తనయులు, వారి కుటుంబ సభ్యులు, ముఖ్య అనుచరులు షాడో అవతారమెత్తారు. ఎమ్మెల్యేలకు బదులుగా అన్నీ వారే చక్కబెట్టేస్తున్నారు. ప్రభుత్వ పరంగానైనా.. ప్రైవేట్ సెటిల్‌మెంట్ అయినా.. ఏపని కావాలన్నా వారిని కలిసి ప్రసన్నం చేసుకోవాల్సిందే. ఎన్నికల ముందు పార్టీ మారి సీటు తెచ్చుకున్న ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఆయన ముఖ్య అనుచరులుగా ఉన్న ఇద్దరు టీడీపీ నేతల హవా నడుస్తోంది. పట్టణంలో వ్యక్తుల మధ్య గొడవలు, ఆస్తి తగాదాలకు సంబంధించి సెటిల్‌మెంట్స్ చేయడంలో దిట్టలని పేరు. ఎవరైనా ఎమ్మెల్యేను కలవాలంటే ముందు వీరి అనుమతి పొందాల్సిన పరిస్థితి. ఈ ఇద్దరి షాడోల తీరుతో నియోజకవర్గంలోని తమకు ప్రాధాన్యత లేకుండా ఉందని జనసేన పార్టీ కేడర్ తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలుస్తోంది.

సలాం కొట్టాల్సిందే..

టికెట్ విషయమై ఎన్నికల ముందు హైడ్రామా నడిచిన మరో నియోజకవర్గంలో ఒక టీడీపీ నేత బిల్డప్ మామూలుగా లేదన్న ప్రచారం ఉంది. ఏ పనైనా ముఖ్యనేత వరకు వెళ్లాల్సిన పనిలేకుండా అన్నీ ఆయనే చక్కబెడుతుంటారని నియోజకవర్గంలో చర్చించుకుంటున్నారు. ద్వారపాలకునిగా పేరున్న సదరు నేతకు సలాం కొట్టందే పనులు కావంటున్నారు. **అధికారులు** సైతం ముఖ్యనేత తర్వాత **ఆయనకే విలువిస్తార**ని అనుకుంటున్నారు.

తనయులదే పెత్తనం : ఒక మాజీ మంత్రి నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు బదులు తనయుడే స్వయంగా అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షలు జరుపుతున్నారు. ప్రభుత్వ అధికారి కార్యక్రమాల్లో ఆయనే పాల్గొనడంతో పాటు అభివృద్ధి పనులు పరిశీలన చేస్తున్నారు. ఏ గ్రామానికి ఏఏ పనులు మంజూరు చేయించాలన్నా ఆయనదే అంతిమ నిర్ణయమని పార్టీ వర్గాల్లో భోగట్టా. గతంలో అధికారుల బదిలీలకు సంబంధించి తాము ఇచ్చిన ప్రతిపాదనలు కాదని తనకు కావాల్సిన ఉద్యోగులకు విల్లింగ్ లెటర్లు ఇచ్చుకోవడంతో మిత్రపక్ష సభ్యులు ఆయనతో విభేదించినట్టుగా అప్పట్లో ప్రచారం జరిగింది. మెట్ట ఛాయలున్న మరో నియోజకవర్గంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. నియోజకవర్గంలోని అన్ని వ్యవహారాలు తనయుని కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. పోలీస్‌స్టేషన్, ఇతర వ్యవహారాలు ఆయనే చక్కబెడుతుంటారని నాయకులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

తీరంలో సోదరుడిదే హవా

తీరప్రాంత నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోదరుని పెత్తనంపై చర్చ నడుస్తోంది. ఇటీవల కొత్తగా నియోజకవర్గంలో క్లబ్ మాటున జూద కార్యకలాపాల నిర్వహణలో సదరు నేత పాత్రపై అనుమానాలు ఉన్నాయి. స్థానికంగా వ్యతిరేకత వస్తుండటంతో జిల్లా కేంద్రంలో కార్యాలయాన్ని తెరిచి అక్కడి నుంచి కార్యకలాపాలు సాగిస్తున్నట్టుగా నియోజకవర్గంలో టాక్.

నేతల్లో అసంతృప్తి

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు గాను కూటమి సీట్లు సర్దుబాటులో భాగంగా నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ, మూడు నియోజకవర్గాల్లో జనసేన గెలుపొందాయి. షాడో ఎమ్మెల్యేల వైఖరి మిత్రపక్ష నేతలకు మింగుడు పడటం లేదు. పార్టీ పిలుపు మేరకు కూటమి అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తే షాడోలతో తమకు సరైన ప్రాధాన్యం లేకుండా పోయిందని వారు సన్నిహితుల వద్ద వాపోతున్నారు.

కోళ్ల వైరస్‌తో భయం లేదు

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి



వేల్పూరులో ఫారం వద్ద శానిటేషన్ పనులను పర్యవేక్షిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారి

తణుకు అర్బన్: వేల్పూరు కృష్ణానందం పౌల్ట్రీస్‌లో ఏవీఎన్ ఇన్‌ఫ్లుఎంజా వైరస్ కారణంగా కోళ్ల మరణం వలన ప్రజలు ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. వేల్పూరు రెడ్‌జోన్ ప్రాంతంలోని కోళ్ల ఫారాల్లో శానిటేషన్ పనులను శుక్రవారం ఆయన పర్యవేక్షించారు. సత్వర రక్షణ చర్యలు చేపట్టామని, కోళ్లను కల్లింగ్ చేయడం శాస్త్రీయ పద్ధతిలో పూర్తిస్థాయిలో జరిగిందని స్పష్టం చేశారు. అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేల్పూరులోని కోళ్ల ఫారంలో 22 ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల ద్వారా డిస్‌ఇన్‌ఫెక్షన్, పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయించారు. కోళ్ల ఈకలను పూర్తిస్థాయిలో కాల్చడంతో పాటు కోళ్ల మేత, పెంటలను ఫారాల నుంచి తొలగించి ఖననం చేశారు. పలురకాల రసాయనాలతో కోళ్ల ఫారాలను శుభ్రం చేయించారు. ఈ ప్రక్రియ మరో వారంపాటు సాగుతుందని, అనంతరం ఫారాలను మూడు నెలలపాటు సీజ్ చేస్తామని అధికారులు వివరించారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వాకాని ప్రసాద్, మండల పశు వైద్యాధికారి శంకర్ భావన్నారాయణ ఉన్నారు.

న్యూస్‌రీల్

ముగిసిన రోడ్డు భద్రత మాసోత్సవాలు



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి వరప్రసాద్

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి ఆర్టీసీ చేపట్టిన రోడ్డు భద్రత మాసోత్సవాలు ముగిశాయి. భీమవరం డిపో గ్యారేజీలో మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎన్ఆర్‌వీ వరప్రసాద్ మాట్లాడుతూ డ్రైవింగ్, రోడ్డు నిబంధనలు, రక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమాలు, డ్రైవర్లకు మెడికల్ క్యాంపులు, ఫ్యామిలీ కౌన్సెలింగ్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ తదితర కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గతేడాది ప్రమాదాల రేటు 0.9 ఉండగా ఈ ఏడాది 0.5 శాతానికి తగ్గిందన్నారు. జీరో ప్రమాదాలు లక్ష్యంగా డ్రైవర్లు విధులు నిర్వర్తించాలన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు బస్సుల నడుపుతున్న సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అడిషనల్ ఎస్పీ వి.భీమారావు మాట్లాడారు. జిల్లాస్థాయిలో ఉత్తమ డ్రైవర్లు ముగ్గురు, డిపో స్థాయిలో ఉత్తమ డ్రైవర్లు 12 మందిని సత్కరించి ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే ఆన్‌కాల్ డ్రైవర్లల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని సన్మానించారు. తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, భీమవరం డిపోల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో కోళ్ల ఖననం

భీమవరం(ప్రకాశం చౌక్): కోళ్ల పూడ్చివేత పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. వేల్పూరు గ్రామంలోని రెడ్‌జోన్ పరిధిలో ఆరు కోళ్ల ఫారాల్లో 21,907 కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేశామన్నారు. కృష్ణానందం పౌల్ట్రీలో ఉన్న 7,591 గుడ్లు, 5,020 కిలోల మొక్కజొన్న, 3 వేల కిలోల ప్రోటీన్ ఫీడ్, 8 వేల కిలోల షెల్‌గ్రిడ్, 10,074 కిలోల నూకల తవుడును శాస్త్రీయ పద్ధతిలో భూమిలో నిక్షిప్తం చేశామన్నారు. కోళ్ల షెడ్లను కెమికల్స్‌తో క్రిమిరహితం చేయనున్నట్టు చెప్పారు. అలాగే సూర్య రమణ పౌల్ట్రీలో ఉన్న 17,078 గుడ్లు, 4,860 కిలోల మొక్కజొన్న, 72,600 కిలోల నూకల తవుడు, 13 వేల కిలోల షెల్‌గ్రిడ్‌లను కూడా శాస్త్రీయ పద్ధతిలో పశువైద్య సిబ్బంది, రెవెన్యూ, పౌర సరఫరా శాఖ సిబ్బంది సమక్షంలో భూమిలో నిక్షిప్తం చేశామన్నారు. ఇన్ఫెక్షన్ జోన్‌లోని పౌల్ట్రీ రైతులు తమ కోళ్ల ఫారాలను పశువైద్య సిబ్బంది సమక్షంలో పూర్తిస్థాయిలో శుభ్రపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 2,508 మంది హాజరు

భీమవరం: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌కు 2,508 మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం షిఫ్టులో 1,239 మందికి 1,229 మంది, మధ్యాహ్నం షిఫ్టులో 1,294 మందికి 1,279 మంది హాజరయ్యారని, ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు.

చింతమనేనిది ఉన్మాద చర్య

కొయ్యలగూడెం: దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉన్మాది అని బీసీ, ఎస్సీలపై ఆయన చర్యలు అందుకు నిదర్శనంగా ఉన్నాయని బీసీ సెల్ జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు చిటికెన శ్రీనివాస్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. కారు అడ్డుగా ఉందని ఒక బీసీ డ్రైవర్ మీద చింతమనేని చిందులు వేసి దుర్భాషలాడటం బీసీల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని అన్నారు. గౌడ జాతికి చెందిన డ్రైవర్‌ను ఇష్టమొచ్చినట్టు బూతులు తిట్టే నీతిమాలిన వ్యక్తి చింతమనేని అని విమర్శించారు. చింతమనేని వెంటనే డ్రైవర్ తోపాటు బీసీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ముసునూరు.. కోడ్ పట్టించుకోరు



లోపూడిలో సచివాలయం ఎదురుగా ఫ్లెక్సీలు

ముసునూరు: ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు కావడం లేదు. మండలంలోని చెక్కపల్లి, లోపూడి, సింహాద్రిపురం గ్రామాల్లో పలు ప్రాంతాల్లో పార్టీల ఫ్లెక్సీలు, జెండాలను అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. చెక్కపల్లి-లోపూడి రహదారిలో విద్యుత్ స్తంభాలకు ఫ్లెక్సీలు అలానే ఉన్నాయి.

టెన్త్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ నాగరాణి



సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: జిల్లాలో పదో తరగతి పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో టెన్త్ పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. వచ్చేనెల 17 నుంచి జిల్లాలోని 128 కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. 24,393 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఓపెన్ స్కూల్, ప్రైవేట్ విద్యార్థులు 516 మంది హాజరుకానున్నారన్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వరాదన్నారు. ప్రతి కేంద్రానికీ చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించాలని, 6 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఆర్వోమొగిలి వెంకటేశ్వర్లు, డీఈఓ ఈ.నారాయణ, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ ఎం. సత్యనారాయణ, ఇంటర్మీడియెట్ జిల్లా ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, డీపీఓ బి.అరుణశ్రీ, డీఎంహెచ్ఓ భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత సంజీవయ్య

దామోదరం సంజీవయ్య స్ఫూర్తితో ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య 104వ జయంతి వేడుకలను నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ఇల్లు కట్టుకోవాలనే ప్రతిఒక్కరి లక్ష్యాన్ని నెరవేర్చేందుకు గృహనిర్మాణ శాఖ అధికారులు కృషిచేయాలని కలెక్టర్ నాగరాణి అన్నారు. గృహ నిర్మాణ శాఖ అధికారులతో పీఎంఏవై-ఎన్టీఆర్ కాలనీ గృహ నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లాలో గృహ నిర్మాణాల పురోగతి తక్కువగా ఉందని, సమీక్షించి నిర్మాణాల వేగం పెంచాలన్నారు.

నాణ్యమైన పరిష్కారం : పీజీఆర్ఎస్ దరఖాస్తులను సహేతుకంగా పరిశీలించి, నాణ్యమైన పరిష్కారాన్ని చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై ఆమె సమీక్షించారు. దరఖాస్తులు రీఓపెన్ కాకుండా చూడాలన్నారు.

రోడ్డు నిర్మాణాలు వేగిరపర్చాలి

జిల్లాలో గుంతలు లేని రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారులు, భవనాల శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో 706.93 కిలోమీటర్లకు గాను 551.07 కిలోమీటర్లలో రోడ్లపై గుంతలను పూడ్చామన్నారు.

కాలువల నిర్వహణ ప్రైవేట్‌కు తగదు

ఏలూరు (టూటౌన్): పంట కాలువల నిర్వహణ ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశించినట్టు పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఏలూరు అన్నే భవనంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రతిదీ ప్రైవేటీకరణ దిశలో ఆలోచిస్తున్నారని, దీనిలో భాగంగా కాలువల నిర్వహణ ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ఆలోచన చేస్తున్నారని విమర్శించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలి

ఏలూరు(మెట్రో): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్థవంతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఎన్నికల ఏర్పాట్లపై జేసీ పి.ధాత్రిరెడ్డి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావుతో కలిసి ఆమె సమీక్షించారు. ఈనెల 27న పోలింగ్ రోజు అనుసరించాల్సిన విధానం, వెబ్ కాస్టింగ్, బ్యాలెట్ బాక్సుల తరలింపు, రిసెప్షన్ సెంటర్లు, రూట్ అధికారులు, పోలీస్ బందోబస్తు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, బ్యాలెట్ పేపర్లు, ఎంసీసీ, ఎంసీఎంసీ, పోస్టల్ బ్యాలెట్లు వంటి అంశాలపై చర్చించారు. ఆరు జిల్లాల పరిధిలో జరిగే ఎన్నికల్లో 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. ఏలూరు జిల్లాలో 87 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 26న ఉదయం నుంచి పోలింగ్ సామగ్రి సరఫరా ప్రారంభమవుతుందన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లా పట్టభద్రులకు సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ చేపట్టాలన్నారు. రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని ఈనెల 22న నిర్వహించాలని ఆదేశించారు. మార్చి 3న జరిగే కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు.

పెద్దింట్లమ్మకే పంగనామాలు !

- కొల్లేటికోటలో కూటమి నేతల అరాచకాలు
- అనివేటి మండప ప్రహరీ కూల్చి గేట్లు ఏర్పాటు
- దుకాణాల్లో కొనుగోళ్లకు భక్తులు రావాలని పన్నాగం
- దేవస్థానం కట్టడాలపై తండ్రీ కొడుకుల పెత్తనం



గత ప్రభుత్వంలో నిర్మించిన అనివేటి మండపం



ప్రహరీ కూల్చి అక్రమంగా నిర్మించిన గేటు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: కూటమి నేతలు బరి తెగించారు. ఆలయాల ఆస్తులను స్వప్రయోజనాల కోసం కూలదోస్తున్నారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంపై వీరి కన్ను పడింది. ఇటీవల పచ్చని మొక్కలను కూల్చేశారు. కూటమిలో ఓ పార్టీకి నేతలం అంటూ దేవస్థానం సమీపంలో దుకాణాలు నిర్వహిస్తున్న తండ్రీ కొడుకులు రెచ్చిపోతున్నారు. వీరి వీరంగానికి ఆలయ సిబ్బంది సైతం చేతులెత్తేశారు. కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చుట్టూ తిరుగుతున్న కొడుకు పేరు చెప్పి దేవస్థానం అంతా తనదే అనే ధోరణిలో తండ్రి హవా సాగిస్తున్నారు. చివరకు తన దుకాణాలకు భక్తులు రావడానికి దగ్గర మార్గం కోసం ఏకంగా ప్రహరీ కూల్చి గేటును కూడా ఏర్పాటుచేశారు.

గత ప్రభుత్వంలో అనివేటి మండప నిర్మాణం

పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద సుమారు రూ.4.50 కోట్ల దాతల విరాళంలో వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అనివేటి మండపాన్ని నిర్మించారు. సమీప జిల్లాల్లో అతిపెద్ద అనివేటి మండపం ఇదే కావడం విశేషం. నిర్మాణ క్రమంలో దేవస్థానం వద్ద ఆక్రమణలను తొలగించడంతో అప్పట్లో సదరు తండ్రీ కొడుకులు రెచ్చిపోయారు. అయినా పట్టించుకోకుండా అద్భుతమైన అనివేటి మండపాన్ని మాజీ మాజీ ఎమ్మెల్యే డీఎన్నార్ పూర్తిచేశారు.

అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పయ్యిందా..

పెద్దింట్లమ్మ దేవస్థానం 2.10 ఎకరాల్లో విస్తరించి ఉంది. 2017లో ఎకరా స్థలం ఆక్రమణలకు గురైయ్యిందని గుర్తించారు. అప్పట్లో ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ పీఏ దగ్గరుండి ప్రహరీ కట్టించారు. దీంతో కొందరు దుకాణదారులు గేటు పెట్టుకుంటామని అడిగారు. భక్తుల ఇబ్బంది రీత్యా అవకాశం ఇవ్వలేదు. ఇప్పుడు అదే పీఏ ఎమ్మెల్యే కామినేని వద్దే ఉన్నారు. ప్రహరీకి రెండు గేట్లను సదరు తండ్రీ కొడుకులు అక్రమంగా ఏర్పాటుచేస్తే మౌనం వహిస్తున్నారు. అప్పట్లో గేట్లు ఏర్పాటుకు అవకాశం ఇవ్వని ఈఓ ఆకుల కొండలరావు ఇప్పుడు కూటమి నేతలకు భయపడి కనీసం నోరు మెదపడం లేదు.

పేకాట డెన్‌గా ఇళ్లు : దేవస్థానం సమీపంలో తండ్రీ కొడుకులకు ఇళ్లు, బొమ్మల దుకాణం, కూల్‌డ్రింక్ షాపు, షామియానా సామగ్రి సరఫరా దుకాణాలు ఉన్నాయి. అనివేటి మండపం కట్టించిన తర్వాత ప్రహరీ వీరి దుకాణాలకు అడ్డువచ్చింది. దీంతో కేవలం వీరి దుకాణాలు ఎదురుగా గోడ కూల్చి గేటు ఏర్పాటుచేశారు. ఎదురుగా మరో దుకాణదారుడు గోడ పగులకొట్టాడు. ఆలయ ఈఓ ఉండగానే ఇదంతా జరుగుతున్నా ఏమీ చేయలేని పరిస్థితి. దీనిపై గ్రామ పెద్దలతో పాటు మిగిలిన దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ప్రతి ఆదివారం సదరు తండ్రీకొడుకులు ఇంట్లో యథేచ్ఛగా పేకాట సాగుతోంది. పోలీసులకు సమాచారం అందించినా ఫలితం ఉండటం లేదు. అక్రమ గేట్ల నిర్మాణాన్ని తొలగించకపోతే మిగిలిన దుకాణదారులంతా ప్రహరీని కూల్చడానికి సిద్ధమవుతున్నారు. వీరి అరాచకాలను ఎమ్మెల్యే కామినేని దృష్టికి గ్రామ పెద్దలు తీసుకువెళ్లనున్నారు.

అక్రమ గేట్లు తొలగిస్తాం



దేవస్థానం ప్రహరీ కూలగొట్టడం నేరం. ప్రైవేట్ దుకాణాలకు అనివేటి మండపం నుంచి దారి లేదు. నిర్మాణ సమయంలో కొందరు గేటు ప్రస్తావన తీసుకొస్తే తిరస్కరించాం. ఆలయానికి వచ్చే భక్తులను బట్టే దుకాణదారులు జీవిస్తున్నారు. ఇది గుర్తుంచుకోవాలి. అక్రమంగా నిర్మించిన గేట్లను తీసివేసి గోడను పునర్నిర్మిస్తాం.

– సీహెచ్ రంగారావు, జిల్లా దేవదాయశాఖ అధికారి, ఏలూరు

సా..గుతున్న రబీ

- జిల్లాలో 2.20 లక్షల ఎకరాల్లో దాళ్వా విస్తీర్ణం
- డిసెంబరు నెలాఖరుకే నాట్లు పూర్తిచేయాలన్న వ్యవసాయశాఖ
- ఫిబ్రవరి రెండో వారం వరకు సాగిన నాట్లు
- వంతుల వారీ విధానం అమలు
- నీటి యాజమాన్య పద్ధతులు తప్పనిసరి



పోడూరు మండలం గుమ్ములూరులో వరి చేను

సాక్షి, భీమవరం: ఖరీఫ్ కలిసిరాక రబీ ఆలస్యమవ్వగా.. వెంటాడుతున్న నీటి ఎద్దడి.. ఎరువుల ధరలు పెరగడం.. సర్కారు సహకారం కొరవడటం రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. డిసెంబరు నెలాఖరు నాటికి నాట్లు పూర్తిచేయాల్సి ఉండగా ఫిబ్రవరి రెండో వారం వరకూ పట్టడం గమనార్హం.

కలిసిరాని కాలం : జిల్లాలోని 2.2 లక్షల ఎకరాల్లో రబీ సాగు చేపట్టారు. ఎండలు పెరిగి పంటకు నీటి ఎద్దడి రాకుండా డిసెంబరు నెలాఖరు నాటికి నాట్లు పూర్తిచేయాలని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు గతంలోనే సూచించారు. కాగా తొలకరి పంట కలిసిరాకపోవడం దాళ్వాపై ప్రభావం చూపింది. జిల్లాలోని 2.05 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేయగా ఆరంభంలోనే భారీవర్షాలతో 38 వేల ఎకరాల్లోని పంటకు నష్టం వాటిల్లింది. కోతలు మొదలైన సమయంలో ఫెంగల్ తుపాను పరుగులు పెట్టించింది. తేమశాతం పేరిట దళారులు, మిల్లర్లు బస్తాకు రూ.300లు వరకు కోత పెట్టడంతో రైతులు నష్టపోయారు. ఎకరాకు 35 నుంచి 40 బస్తాల దిగుబడి రావాల్సి ఉండగా 30 బస్తాల లోపే ఉండటంతో చాలామందికి పెట్టుబడులు దక్కలేదు.

పెట్టుబడులు అందక.. ఆయా కారణాలతో పెట్టుబడులకు సొమ్ములు లేక రబీ ఆలస్యమైంది. సాధారణంగా జిల్లాలో సంక్రాంతి నాటికి 75 శాతం మేర రబీ నాట్లు పూర్తిచేసి మిగిలిన విస్తీర్ణంలో నెలాఖరు నాటికి నాట్లు పూర్తిచేసేవారు. ఈసారి సంక్రాంతికి 50 శాతం కూడా నాట్లు పడకపోగా ఫిబ్రవరి రెండో వారం నాటి వరకు నాట్లు వేస్తూ వచ్చారు. ఈ సీజన్‌లో 120 నుంచి 125 రోజులు పంట కాలం కలిగిన వంగడాలను సాగుచేయడంతో మే మొదటి వారం వరకు సాగు జరిగే అవకాశం ఉంది.

అందని సహకారం

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు ఏటా రూ. 20 వేలు చొప్పున ఇస్తామన్న కూటమి హామీ అమలుకు నోచుకోలేదు. జిల్లాలోని 86,610 మంది రైతులకు విడతకు రూ.2 వేల చొప్పున రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం రూ.34.64 కోట్లు పీఎం కిసాన్ సాయం మాత్రమే అందింది. చంద్రబాబు సర్కారు తొలకరి పంట నష్టానికి బీమా పరిహారం అందించలేదు.

మొదలైన సాగునీటి కష్టాలు

రబీ రైతులకు ఆరంభంలోనే ఎరువుల ధరలు షాకివ్వగా తర్వాత సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. పెరిగిన ధరలతో ఎకరాకు రూ.500ల వరకు రైతులపై ఎరువుల భారం పడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోని ఉచిత పంటల బీమా పథకానికి కూటమి సర్కారు మంగళం పాడటంతో ఎకరాకు రూ.615లు ప్రీమియం భారం రైతులపైనే పడింది.

వంతుల వారీ విధానం

జిల్లాలో రబీ సాగుకు 30 టీఎంసీల సాగునీరు అవసరం. గోదావరి సగటు నీటి లభ్యత తగ్గడంతో శివారు ప్రాంతాలకు నీరందని పరిస్థితి. నీటి ఎద్దడిని అధిగమించేందుకు జిల్లాలో 11 ప్రధాన పంట కాలువలకు ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 4 వరకు వంతుల వారీ విధానం (టర్న్ సిస్టం)కు జిల్లా నీటిపారుదల శాఖ షెడ్యూల్‌ను రూపొందించి అమల్లోకి తెచ్చింది.

క్లుప్తంగా

స్కూల్ బస్సును ఢీ కొట్టిన కారు



జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కారు

యలమంచిలి : కాజ పడమర పంచాయతీ పరిధిలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. కలగంపూడి గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను ఇంటి వద్ద దించి తిరిగి వస్తుండగా చించినాడ వైపు నుంచి పాలకొల్లు వస్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో స్కూలు బస్‌లో విద్యార్థులు లేరు.

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



నూజివీడు మండలం దేవరగుంటలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నూజివీడు: మండలంలోని దేవరగుంటలో ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు నూజివీడు ఎక్సైజు సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. అంతేగాకుండా నేరస్థలం నుంచి పారిపోయిన పెనిమల కోటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై ఈశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నూజివీడు, చాట్రాయి, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లో ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా, కాపుసారా తయారుచేసినా, విక్రయించినా, సరఫరా చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా ఎక్సైజ్ నేరాలు జరుగుతుంటే 9440902462 నెంబరకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

16న 'తిరుమల'లో అవగాహన సదస్సు

తణుకు అర్బన్: 5 నుంచి 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులకు తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఈనెల 16న జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్ అండ్ నీట్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తణుకు క్యాంపస్‌లో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సదస్సు ద్వారా ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, బిట్స్‌లాంటి విద్యాసంస్థల్లో సీటు సాధించేందుకు ప్రిపేరయ్యే విధానం, తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దాలో, ఉన్నత విలువలు నేర్పే విధానాలను తెలియజేస్తామని వివరించారు. ఈ సదస్సుకు హాజరుకావాలంటే ముందుగా తిరుమలఇడియు.కామ్‌లో రిజిస్టర్ చేసుకోవాలని, రిజిస్టర్ చేసుకోని వారు అదేరోజు ఉదయం 9 గంటలలోపు తణుకు క్యాంపస్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు.

అమ్మకు మహా నివేదన

- ముగిసిన మావుళ్లమ్మ 61వ వార్షికోత్సవాలు
- రూ.1.10 లక్షలు పలికిన లడ్డు
- 70 వేల మందికి అన్నదానం



అమ్మవారికి మహా నివేదన





అన్నపూర్ణాదేవి అలంకరణలో శ్రీమావుళ్లమ్మ, అమ్మవారి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ 61వ వార్షిక మహోత్సవాలు నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన జరిగింది. శుక్రవారం ఉదయం 7.30 గంటలకు అమ్మవారికి మహా నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా ఎమ్మెల్యే అంజిబాబు, ఉత్సవ నిర్వాహకులు పలు రకాల పిండి వంటలు, స్వీట్లు, పులిహోర తదితర పిండివంటలు మహా నివేదనగా సమర్పించారు.

అన్నపూర్ణాదేవిగా మావుళ్లమ్మ

మావుళ్లమ్మ అమ్మవారికి శుక్రవారం అన్నపూర్ణాదేవిగా అలంకరణ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి సమర్పించిన 36 కిలోల లడ్డూకు వేలం పాట నిర్వహించగా భీమవరానికి చెందిన పడమటి రామకృష్ణ రూ.1.10 లక్షలకు వేలం పాటలో దక్కించుకున్నారు. ఆలయం వద్ద అన్నప్రసాద స్వీకరణకు పట్టణంతో పాటు జిల్లా నలుమూల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దాదాపు 70 వేల మంది అమ్మవారి తీర్థప్రసాదం స్వీకరించారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అన్నదానంలో పాల్గొన్నారు. మహిళలకు ఆదివారం బజారు రోడ్డులో ప్రత్యేక ఏర్పాటు చేశారు. అమ్మవారిని పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు దర్శించుకున్నారు.

గ్రీన్ హైడ్రోజన్‌పై సదస్సు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త భగవాన్ నారాయణ

నూజివీడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టి సారించినందున విద్యార్థులు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని ఉద్యోగాలు సాధించాలని ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ భగవాన్ నారాయణ పేర్కొన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో శుక్రవారం గ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్ ఇంధన ప్రత్యామ్నాయం అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శాస్త్రవేత్త భగవాన్ నారాయణ మాట్లాడుతూ పునరుత్పాదక శక్తి వనరుల ఆధారంగా ఉత్పత్తయ్యే గ్రీన్ హైడ్రోజన్ శుద్ధత, వినియోగ అవకాశాలు, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను వివరించారు. హైడ్రోజన్ తయారీలో ఉపయోగించే విద్యుత్ పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే వస్తున్నందున ఈ ప్రక్రియ కాలుష్య రహితమన్నారు. గ్రీన్ హైడ్రోజన్‌ను భావి ఇంధనంగా రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ 2030 నాటికి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పెద్ద ఎత్తున ప్రారంభమవుతుందని, దీంతో భవిష్యత్ అంతా గ్రీన్ హైడ్రోజన్‌దేనన్నారు. డీన్ అకడమిక్స్ చిరంజీవి, సెమినార్ కన్వీనర్ దుర్గాబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి క్షేత్రానికి కాలినడకన వస్తున్న భక్తులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న క్షేత్రానికి కాలినడక భక్తులు శుక్రవారం పోటెత్తారు. దాంతో ఆలయ పరిసరాలు కళకళలాడాయి. రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు, భీమవరం, ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, నిడమర్రు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు దూబచర్ల–రాళ్లకుంట మీదుగా క్షేత్రానికి చేరుకున్నారు. విజయవాడ, ఉయ్యూరు, ఏలూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు భీమడోలు మీదుగా, ఖమ్మం, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం ప్రాంతాలకు చెందిన వారు కామవరపుకోట మీదుగా వచ్చారు. దేవస్థానం అధికారులు వేలాదిగా తరలివచ్చిన కాలినడక భక్తులకు నిత్యాన్నదాన భవనంలో ఉచిత అన్నప్రసాదాన్ని, స్వామివారి దర్శనం టికెట్లను అందించారు.

పెనుగొండ క్షేత్రంలో ఆధ్యాత్మిక శోభ




ఆకట్టుకొన్న రథోత్సవం



భారీ వాసవీ మాత విగ్రహం

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ కన్యక పరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం పెనుగొండ క్షేత్రం శుక్రవారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. తమిళనాడు ఆర్యవైశ్య మహాసభ సేలం జిల్లా విభాగం ఆధ్వర్యంలో తరలివచ్చిన వాసవీ భక్తులు నిర్వహించిన గ్రామోత్సవం కనుల పండుగగా జరిగింది. పురవీధుల్లో సుమారు 1000 మంది జై వాసవీ.. జైజై వాసవీ అంటూ వాసవీ మాత నామ స్మరణతో హోరెత్తించారు. పెనుగొండలో రెండు రోజులుగా పూజా కార్యక్రమాలు, వాసవీ మాత అలంకరణలో తమిళనాడు తరహాలో నిర్వహిస్తూ ఆకట్టుకుంటున్నారు. మొదటి రోజు అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ ధాంలో నిర్వహించగా, రెండో రోజు శ్రీనగరేశ్వర మహిషాసురమర్దనీ ఆలయంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు, అభిషేకాలు అనంతరం వాసవీ థాం నుంచి గ్రామోత్సవాన్ని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభించారు. ప్రత్యేక రథం ఆకట్టుకొంది. వాసవీ ఉత్సవ విగ్రహాన్ని వెండిరథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎన్ గోవిందరాజులు, క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాలాస్వామి), మహాసభ చైర్మన్ వీఎస్ శ్రీనివాసన్, కార్యదర్శి ఎం.సురేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టిసం ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



నదిలో తడికలు, బాదులు వేసి ప్లాట్‌ఫాం ఏర్పాటు చేసిన దృశ్యం



శివక్షేత్రం వద్ద దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలైన్





పట్టిసం రేవులో ఉత్సవాలకు సిద్ధమైన రాముడి విగ్రహం, ఆంజనేయుడి విగ్రహం

పోలవరం రూరల్: పట్టిసం మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు లక్షమందికి పైగా భక్తులు హాజరవుతారనే అంచనాతో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేపట్టింది. ఉత్సవ కమిటీ చైర్మన్ జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ ఇప్పటికే రెండు దఫాలు సమావేశం నిర్వహించి అధికార యంత్రాంగానికి ఏర్పాట్లపై ఆదేశాలు జారీ చేశారు. ఖర్చుకు వెనుకాడకుండా సంబంధిత శాఖ అధికారులు చేపట్టాల్సిన పనులు పూర్తి చేయాలన్నారు. లోటుపాట్లను సరిచేసుకుని అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. దేవస్థానం వద్ద భక్తులు దర్శనం చేసుకుని వీలైనంత త్వరగా బయటికి వచ్చేలా క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణ తదితర పనులను దేవస్థానం ఈవో చాగంటి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. కాలినడకన భక్తులు క్షేత్రానికి వెళ్లి వచ్చేలా నదిలో కొంత దూరం ఇసుకను డ్రెడ్జింగ్ చేసి ఇరువైపులా తడికలు, బాదులతో పనులను చేపట్టారు. మరికొంత దూరం పంట్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంమయ్యారు. ప్లాట్‌ఫాంలు, టికెట్ కౌంటర్లు, క్యూలైన్‌లు తదితర పనులను చేపట్టారు. గత నాలుగు సంవత్సరాలుగా పట్టిసం పంచాయతీలో ఏర్పాట్లు చేసిన టెండర్‌దారులకు ప్రస్తుతం బకాయిలు ఉండడంతో కొన్ని పనులు చేపట్టేందుకు టెండర్‌దారులు సాహసం చేయలేకపోతున్నారు. పట్టిసం రేవులో ఆంజనేయస్వామి, రాముల వారి విగ్రహాలకు రంగులు వేసి ముస్తాబు చేశారు.

తాగునీటి ట్యాంకులో వ్యక్తి మృతదేహం



మృతుడు స్వామి

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిఆంధ్ర వీధి సమీపంలో ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచి నీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో వ్యక్తి మృతదేహం బయటపడటం శుక్రవారం కలకలం రేపింది. కె.కొత్తూరు సమీపంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెస్‌లో మేనేజ్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న పాలకొల్లుకి చెందిన చందనాల స్వామి(42) ఈ 12న ఊరు వెళ్తానని చెప్పి ద్విచక్రవాహనంపై బయటకు వచ్చేశాడు. శుక్రవారం సాయంత్రం రక్షిత మంచి నీటి పథకం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో శవమై తేలడాన్ని అక్కడి సిబ్బంది గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. అక్కడే ఉన్న ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు.

పంట కాలువలో వైరస్ కోళ్లు

బెంబేలెత్తుతున్న పరిసర గ్రామాల ప్రజలు



పాలకొల్లు మండలం జిన్నూరు పంట కాలువలో తేలుతున్న చనిపోయిన కోళ్ల మూట



మోగల్లు రేలంగి చానల్లో కోళ్ల కళేబరాలు మూటలు కట్టి పడవేసిన దృశ్యం

పాలకొల్లు అర్బన్ : వైరస్‌తో చచ్చిన కోళ్ల పంట కాలువలతో మూటలుగా తేలుతున్నాయి. గత వారం రోజుల నుంచి జిల్లాలో వివిధ కోళ్లఫాంలలో వైరస్ సోకి చనిపోతున్న కోళ్లను మూటలు కట్టి కాలువలతో పడేస్తున్నారు. దీంతో అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. కాలువ గట్టు సమీపంలో ఉండేవారు ఆ దుర్వాసన భరించలేకపోతున్నారు. పాలకొల్లు మండలంలోని రాపాక చానల్ వాలమర్రు, కాపవరం, లంకలకోడేరు, దగ్గులూరు, అరట్లకట్ట, వెంకటాపురం, గవరపేట, పాలమూరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల, తిల్లపూడి గ్రామాల మీదుగా ప్రవహిస్తుంది. బర్డ్‌ఫ్లూ సోకి చనిపోతున్న కోళ్లను పంట కాలువలో మూటలు కట్టి పారేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కోళ్ల మూటలు తమ ఇళ్ల ముందు నిలిచిపోవడంతో వాటిని గడలతో గెంటుతున్నామంటున్నారు. పంట చేలకు నీరు పెట్టుకోవడానికి వెళుతుంటే కోళ్ల మూటలు కనబడుతున్నాయని.. వాటి దుర్వాసన భరించలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.

రేలంగి చానల్‌లో కోళ్ల మూటలు

పాలకోడేరు: మోగల్లు గ్రామం మొత్తానికి సురక్షిత నీరు అందించే పంచాయతీ చెరువులోనికి వచ్చే నీటి కాలువైన రేలంగి చానల్ కాలువలో మృతి చెందిన కోళ్ల గోనె సంచుల్లో రావడంతో జనాలు బేంబేలెత్తుతున్నారు. బర్డ్ ఫ్లూ సోకిన కోళ్ల చనిపోవడంతో వాటి మూటలు గట్టి పంట కాలువలో వేయడం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కాలువ నీరు వాడడం మానేశాం



రాపాక చానల్ ఒడ్డున మా ఇల్లు ఉంది. చిన్న చిన్న అవసరాలకు పంట కాలువలో నీరే వాడుకుంటాం. గత పది రోజుల నుంచి చనిపోయిన కోళ్ల మూటలు తేలుతున్నాయి. దుర్వాసన రావడంతో భరించలేకపోతున్నాం. కాలువ నీరు వాడడం మానేశాం. – ఆదారి రమణమ్మ, గవరపేట

ఫిర్యాదు చేసినా స్పందన లేదు



ఇక్కడ ప్రతిరోజు చనిపోయిన కోళ్ల మూటలు ఆగిపోతున్నాయి. దీంతో గెడతో కిందకు గెంటుతున్నాం. ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశాం. లాకుల లస్కర్ స్పందించడం లేదు. – మళ్ల కృష్ణ, బల్లవంతెన, గవరపేట

దుర్వాసన భరించలేకపోతున్నాం



తేలుతున్న మూటల నుంచి దుర్వాసన వస్తోంది. పురుగులు తేలుతున్నాయి. వాసన భరించలేక తలపోటు వస్తోంది. పంట కాలువ నీరు స్వచ్ఛంగా ఉండేది. పది రోజుల నుంచి చాలా ఇబ్బందులు పడుతున్నాం. – వేగి మంగమ్మ, గవరపేట

పోస్టల్ శాఖను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం



పాలకొల్లు పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

పాలకొల్లు అర్బన్ : పోస్టల్ శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆ శాఖ ఉద్యోగులు శుక్రవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోస్టల్ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు మార్చి 18 నుంచి దేశవ్యాప్తంగా ఉద్యోగులంతా సమ్మె చేయనున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ ధర్నాలో సంఘ నాయకులు ఎంఆర్‌బీ రవికుమార్, చింతా శివ, రాము, కరుణానిధి, సూర్యనారాయణ తదితరులు నాయకత్వం వహించారు.

టెన్నీకాయిట్ జట్ల ఎంపిక



టెన్నీకాయిట్ జట్లకు ఎంపికైన క్రీడాకారులు

లింగపాలెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 48వ సీనియర్స్ మహిళలు, పురుషుల టెన్నీకాయిట్ సెలెక్షన్స్ శుక్రవారం మండలంలోని ఐ.గోకవరంలో నిర్వహించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నీకాయిట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్టీ తిరుపతిరావు తెలిపారు. శుక్రవారం మండలంలో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బి.శ్రీను అధ్యక్షతన అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 22, 23 తేదీల్లో గోపాలపురం మండలం చిట్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఎన్నికైన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పురుషుల జట్టుకు కె.వంశీ, బి.చంటిబాబు, ఎం.పవన్‌కుమార్, ఎం.రాజు, ఎ.వంశీ, మహిళల జట్టుకు కె.మౌనిక, ఎస్‌డీ హనీఫా, జి.సత్యయామిని, టి.జ్యోత్సితలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మండవల్లి: మండలంలోని చింతపాడు–దయ్యంపాడు మధ్యలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పులపర్రు గ్రామానికి చెందిన ఘంటసాల శ్రీనివాసరావు(37) మృతి చెందాడు. కైకలూరు వైపు నుంచి ఏలూరు వైపునకు మోటారు వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొని మృతి చెందాడు.

పేకాట శిబిరాలపై దాడులు.. సిబ్బంది చేతివాటం

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలోని మెట్టలో జోరుగా పేకాట, కోడి పందేలు సాగుతుండగా.. స్పెషల్ సిబ్బంది దాడులు చేస్తూ దందాలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందినకాడికి సొమ్ములు జేబులో వేసుకుంటున్నారని సమాచారం. ఇటీవల చింతలపూడి సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిగూడెంలో ఒక పేకాట శిబిరంపై ఐడీ, స్పెషల్ పార్టీ సిబ్బంది దాడి చేశారు. పేకాటరాయుళ్ల నుంచి సుమారు రూ.23 వేల సొమ్ము, 4 మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నారు. పేకాట శిబిరంపై దాడిలో కనీసం హెడ్ కానిస్టేబుల్, ఏఎస్సై స్థాయి అధికారి కూడా లేకుండానే అంతా తామే అన్నట్లు ఐడీ, స్పెషల్ పార్టీ పోలీసులు దాడులు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం వరకూ పేకాటరాయుళ్లను గానీ, మోటారు సైకిళ్లను గానీ స్టేషన్‌లో అప్పగించలేదని తెలుస్తోంది. పేకాట శిబిరంలో స్వాధీనం చేసుకున్న నాలుగు బైక్‌లకు బదులు ఒక్క బైక్ అప్పగించగా... రూ.6 వేలు మాత్రమే అప్పగించినట్లు తెలుస్తోంది. ఇదంతా స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు తెలిసే జరుగుతుందా? లేక సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నారా? అనేది తెలియాల్సి ఉంది. ఈ నెల ప్రారంభంలో ఒక పేకాట శిబిరంపై దాడులు చేయగా స్వాధీనం చేసుకున్న బైక్‌లకు రేటు కట్టి వారికి అప్పగించేసారనే ఆరోపణలు ఉన్నాయి. ఇష్టారాజ్యంగా ఐడీ, స్పెషల్ పార్టీ సిబ్బంది దందాలకు పాల్పడుతున్నారు. చోటా నాయకుల కనుసన్నల్లో ఇదంతా చేస్తున్నారనే అభిప్రాయం ఉంది. దీనిపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేపడితే బయటకు వస్తాయని అంటున్నారు.

ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడ్డ బాలుడి మృతి

భీమవరం: భీమవరం పట్టణంలోని గులాబీ సెంటర్‌లో ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న బొర్రా కోటేశ్వరరావు(10) మృతిచెందాడని భీమవరం వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం చెప్పారు. జనవరి 12న స్కూల్ బ్యాగ్‌తో రోడ్డుపై నిలబడిన కోటేశ్వరరావు బ్యాగ్ ట్రాక్టర్ ట్రక్కు కొక్కెం పట్టుకోవడంతో రోడ్డుపై కొంతదూరం ఈడ్చుకుపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స కోసం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా గురువారం మృతిచెందాడు, మృతుడి తండ్రి లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

కొండ్రుప్రోలులో అన్నసమారాధన



ఉయ్యూరి వీరమ్మ, కనక చింతమ్మ ఆలయం వద్ద అన్నసమారాధన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో ఉయ్యూరి వీరమ్మ, కనక చింతమ్మ వారి కల్యాణ మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి బొట్టా నాగేశ్వరరావు, బొట్టా శ్రీనివాస్, యువకులు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టుతో నాణ్యమైన పంటలు



దండగర్ర గ్రామంలోని నాడెప్ పిట్‌లను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్

తాడేపల్లిగూడెం రూరల్: వర్మీ కంపోస్టు ద్వారా నాణ్యమైన పంటలు పండించవచ్చని ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని దండగర్ర గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్డీ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను, కూరగాయల వేస్ట్‌ను తడి, పొడిగా విభజించి నాడెప్ పిట్‌లలో వేసి వర్మీ కంపోస్టు తయారు చేయవచ్చన్నారు. దీన్ని తయారు చేసే విధానాన్ని తెలియజేశారు. ఇలా తయారు చేసిన వర్మీ కంపోస్టు ద్వారా పంటలు పండించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శివ, ఎంఆర్‌సీ ఎం. రవికిరణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీమాకు ప్రాధాన్యత ఇవ్వండి



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రసింగ్ నాయక్

తాడేపల్లిగూడెం: వాహనాల బీమాకు ప్రాధాన్యత ఇవ్వాలని పట్టణ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సురేంద్రసింగ్ నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. లారీలు, ఆటోలు, క్యాబ్ డ్రైవర్లు అందరూ బీమా గురించి తెలుసుకోవాలన్నారు. చోళ ఇన్‌స్రూ బ్రాంచ్ మేనేజర్ గొల్ల వెంకటనాగేశ్వరరావు బీమా ఆవశ్యకత వివరించారు. డ్రైవర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు



కుంచనపల్లి గ్రామంలో హోమాలు నిర్వహిస్తున్న దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి ద్వారకానగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీదేవీ, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు రెండవ రోజు శుక్రవారం కొనసాగాయి. ఈ సందర్భంగా పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలాధివాసం, ధాన్యాధివాసం, అధివాస హోమం ఇత్యాది పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటి ప్రతినిధుల ఆధ్వర్యంలో దంపతులు పూజా కార్యక్రమాలు జరిపారు. ఆలయాన్ని ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఆర్‌వీ.బ్రహ్మం, బాలగోపాల శ్రీనివాస చంద్రరాజు పాల్గొన్నారు.

సుందర్‌ను గెలిపించాలి

తణుకు అర్బన్: తణుకు పట్టభద్రుల ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుందర్‌ను గెలిపించాలని కోరుతూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇంజనీర్స్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తమ ప్రథమ ప్రాధాన్యత ఓటును సుందరకు వేయాల్సిందిగా అభ్యర్థించినట్లు తణుకు నియోజవర్గ దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు, న్యాయవాది పొట్ల సురేష్ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సుందర్ అఖండ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, నాయకులు గంజి మధు, ఐక్యవేదిక న్యాయ సలహాదారు గొల్లపల్లి అంబేద్కర్ పాల్గొన్నారు.

నిలువ నీడ లేదు!

తాడేపల్లిగూడెం పట్టణంలో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇక్కట్లు

తాడేపల్లిగూడెం (టీఓసీ): డివిజన్ కేంద్రమైన గూడెం పట్టణంలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికుల అవస్థలు పడుతున్నారు. నీడ కోసం షాపుల్లో, టీ షాపుల వద్ద దలదాచుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు నిలిపే ఎన్టీఆర్ జంక్షన్, అంబేడ్కర్ జంక్షన్ సెంటర్‌లో బస్ షెల్టర్లు లేవు. దీంతో వేసవి కాలంలో ఎండకు, వర్షాకాలంలో వానకు తడుస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గూడెం డిపోలో 97బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు ప్రతి రోజూ చేరవేస్తుంటాయి. భీమవరం, పెంటపాడు, ఏలూరు, విజయవాడ వెళ్లే ప్రయాణికులు ఈ సెంటర్‌లో ఆగుతారు. విజయవాడ, ఏలూరులో తణుకు వేళ్లే ప్రయాణికులతో పాటు దగ్గర గ్రామాలైన ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు. పట్టణంలో పలు చోట్ల బస్సు తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉంటారు.ఈ ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు బస్‌షెల్టర్ల నిర్మాణంపై దృష్టి సారించకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడిమికి తట్టుకోలేక దగ్గరలో ఉన్న షాపుల పంచన ఆశ్రమం పొందాల్సి వస్తోంది. షాపుల యజమానులు తమ వ్యాపారం దెబ్బతింటుందని చీదరించుకుంటుండటంతో అటు నీడ లేక ఇటు ఎండలో ఉండలేక ప్రయాణికులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. దాతల సహకారంతో బస్‌షెల్టర్లను నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బస్సు షెల్టర్లు లేని ప్రాంతాలు:
తాడేపల్లిగూడెం బస్సు కాంప్లెక్స్ నుంచి ఏలూరు, భీమవరం, తణుకు, నల్లజర్ల వైపు బస్సు రూట్లు ఉన్నాయి. బస్సు కాంప్లెక్స్ నుంచి ప్రధాన తాలూకా ఆఫీస్ సెంటర్ వద్ద బస్సు షెల్టర్ లేదు. అదే విధంగా మరో ప్రధాన సెంటర్ శేషమహల్ రోడ్డు ప్రారంభంలో ఎన్టీఆర్ జంక్షన్ వద్ద షెల్టర్ లేదు. ఓవర్ బ్రిడ్జి మీదుగా ప్రయాణించి మోడ్రన్ కేఫ్ ప్రక్కన ఏలూరు వైపు వెళ్లే బస్సు స్టాప్, పాత ప్రభాత టాకీస్ సమీపంలో భీమవరం వైపు వెళ్లే బస్సు స్టాప్‌లు వద్ద సైతం షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణీకులు ఇక్కట్లు వర్ణణాతీతం. తణుకు, నిడదవోలు వైపు వెళ్లే బస్సు షెల్టర్ కాలువ సమీపంలో ఉండటం, వచ్చే బస్సులు కనపడకపోవడంతో షెల్టర్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలోనే ప్రయాణీకులు బస్సులు కోసం నిలుచుని వేచి చూస్తున్నారు. అదే విధంగా నల్లజర్ల వైపు గొల్లగూడెం సెంటర్ వద్ద షెల్టర్ లేదు. హౌసింగ్‌బోర్డు సెంటర్ వద్ద షెల్టర్ ఉన్న మూలగా ఉండటంతో అది నిరుపయోగంగా మారింది. ఆ బస్సు షెల్టర్‌ను ఎవరూ ఉపయోగించడం లేదు.

షెల్టర్లు లేక ప్రయాణీకులు ఇబ్బందులు:
రానున్న వేసవి కావడం, తీవ్రమైన ఎండలు ఉండవచ్చునని అంటున్నారు. ఎండలు మండుతున్న సమయంలో ప్రయాణీకులు ఎదో ఒక నీడ ప్రదేశం ఎన్నుకోవడం జరుగుతుంది. ప్రయాణీకులు షెల్టర్ లేకపోవడంతో బస్సులు కోసం రోడ్డు మీదే నిలబడి ఎదురు చూస్తున్నారు. వర్షాకాలంలో సైతం షెల్టర్ లేక షాపులు వద్ద నిలబడటం, లేని పక్షంలో రోడ్డుపైనే ఉంటున్నారు. ఈ క్రమంలో స్టాప్‌లు వద్ద ప్రయాణీకులను ఎక్కించేందుకు బస్సు రోడ్డుపైన ఆపినప్పుడు బస్సు వెనుక నున్న వాహనాలు వారు ముందుకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో పలు చోట్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంది. ముఖ్యంగా ఏలూరు వైపు వెళ్లే రహదారిలో ప్రయాణీకులు బస్సు ఎక్కే వరకు ఎక్కడ వాహనాలు అక్కడే ఆగిపోతున్నాయి. తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్టీఆర్ జంక్షన్, భీమవరం వైపు, ఏలూరు వైపు బస్సు షెల్టర్లు నిర్మాణం చేపట్టి బస్సులను రోడ్డు మీద నిలిపి ఉంచుకుండా ప్రక్కకు తీసే విధంగా ఏర్పాట్లు చేస్తే ట్రాఫిక్ సమస్య కూడా తగ్గుతుందని ప్రజలు చెప్పుతున్నారు. నిర్మాణాలు చేపట్టడంతో పాటు ఈ వేసవిలో ప్రయాణీకులకు ఇబ్బందులు లేకుండా గ్రీన్ కలర్ చలువ పందిర్లు వేయాలని కోరుతున్నారు.



స్థానిక ఏలూరు రోడ్డులో బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు



ఎన్టీఆర్ జంక్షన్ వద్ద బస్సులు కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

బస్సు షెల్టర్లు నిర్మించాలి



పట్టణంలో బస్సు షెల్టర్లు నిర్మించాలి. తద్వారా ప్రయాణీకులు బస్సులు కోసం రోడ్డు మీద పడిగాపులు పడనవసరం లేదు. షెల్టర్లు నీడ నిస్తాయి. బస్సులు వచ్చేవరకు కూర్చునేందుకు, సేద తీరేందుకు అవకాశం ఉంటుంది.
– చింతకాయల సత్యనారాయణ, సీనియర్ టైలర్, తాడేపల్లిగూడెం

చలువ పందిర్లు ఏర్పాటు చేయాలి



ఎండలు ముదురుతున్నాయి. బస్సు స్టాప్‌లు వద్ద షెల్టర్‌లు లేకపోవడంతో ప్రయాణీకులు రోడ్లపై నిలిచిఉంటే వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. బస్సు షెల్టర్లు ఏర్పాటు చేసే వరకు గ్రీన్ చలువ పందిర్లు వేయాలి. సంబంధిత అధికారులు ఆ దిశగా కృషి చేయాలి.
– ఎస్.భారతి, గృహిణి, తాడేపల్లిగూడెం

చికిత్స పొందుతూ యువకుడు మృతి

అత్తిలి: రోడ్డు ప్రమాదంలో గాయపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతిచెందిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. అత్తిలి సీతానగరంకు చెందిన యండమూరి నవీన్‌కుమార్(18), అతని స్నేహితుడుతో కలసి ఈనెల 12వ తేదీన బైక్‌పై భీమవరం వెళ్లి తిరిగి వస్తుండగా పాలూరు గ్రామంలో ఎదురుగా వస్తున్న ట్రక్ ఆటో, బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో నవీన్‌కుమార్ తలకు తీవ్రగాయమైంది. 108 వాహనంలో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తిరిగి తణుకు ఆసుపత్రికి తీసుకువచ్చారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ నవీన్‌కుమార్ మృతిచెందాడని, మృతుని తండ్రి దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

భీమవరం: ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల అనేక మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి ప్రసాద్ అన్నారు. శుక్రవారం భీమవరం డీఎన్నార్ కళాశాల ఆవరణలో 36వ జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ, డీఎన్నార్ వాకర్స్, కాఫీ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 2కె వాక్ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు చాలా మంది పాటించడం లేదని, ద్విచక్రవాహనం నడిపేటపుడు హెల్మెట్, కారు నడిపే సమయంలో సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రయాణ సమయంలో చేసే చిన్న పొరపాటు వల్ల మీతోపాటు ఇతరుల ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందన్నారు.

ఆరోగ్య సూత్రాలు పాటిద్దాం



తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తణుకు అర్బన్: ప్రతి ఒక్కరు ఆరోగ్య సూత్రాలు పాటించి, వ్యాధుల నుంచి రక్షణ పొందాలని తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమం అనేది దోమ పుట్టుకను చెక్ పెట్టడానికి ఉద్దేశించిన అవగాహన కార్యక్రమం అని, ప్రతి శుక్రవారం శుభ్ర వారంగా పాటించాలని అన్నారు. ఇళ్ల ఆవరణలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవడం, వారానికోసారి తొలగించుకోవడం దోమ పుట్టుకను నిలువరించవచ్చునని స్పష్టం చేశారు. దోమలు పెట్టిన లార్వా దోమగా రూపాంతరం చెందేందుకు 8 నుంచి 10 రోజులు సమయం పడుతుందని, ఈ వ్యవధిలోపు శుభ్రం చేసుకుంటే దోమలు నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యన్నారాయణ, వార్డు హెల్త్ సెక్రెటరీ పి.మాధవి, మెప్మా రిసోర్స్ పర్సన్ జి.సుహాసిని పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



పెంటపాడు: అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తణుకు అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య పరిరక్షణ కేంద్రాలని ప్రాజెక్ట్ సీపీడీవోఎం.ఆశారోహిణి అన్నారు. తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పోషణ్ బీ...పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలంతా తమ కేంద్రాల్లో సమయపాలన, విద్యతోపాటు పోషకాహారం అందజేయడంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పోషకాహార లోపం వల్ల చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా తమ వంతు కృషి చేయాలన్నారు. సేంద్రియ పద్ధతులతో పోషణ వాటికలో ఆకుకూరలు, కూరగాయలను పండించి వాటినే వారికి ఆహారంగా అందజేయాలని తద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వీవీకేఎస్ కృష్ణకుమారి, వెంకటలక్ష్మి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన విద్య
పెంటపాడు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రతి బిడ్డకు ప్రతి రోజూ కనీసం రెండు గంటలు అధిక నాణ్యత కలిగిన ప్రీ-స్కూల్ విద్యను మాతృ భాషలో అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పోషణ్ భీ- పడాయి భీ కార్యక్రమం చేపట్టిందని పలువురు వక్తలు తెలిపారు. పోషణ్ బీ- పడాయి భీ శిక్షణలో భాగంగా గూడెం మండలం కృష్ణాయిపాలెం, పెంటపాడు మండలం మీనవిల్లూరు గ్రామాల్లో ఐసీడీఎస్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో గూడెం,పెంటపాడు, టౌన్ ప్రాంతాలకు చెందిన ఐసీడీఎస్ సిబ్బందితో పాటు, సూపర్‌వైజర్‌లు దుర్గాభవాని, జీజీబీ విజయలక్ష్మి, సుజాత, ఎస్తేరురాణి, శ్రీదేవి, బేబీ తదితరులు పాల్గొన్నారు. శనివారం ఈ కార్యక్రమం ముగిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

వీర రాఘవులును గెలిపించాలంటూ ప్రచారం



పట్టణంలో ప్రచారం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పీడీఎఫ్ బలపరిచిన పట్టభద్రల ఎమ్మెల్సీ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులను గెలిపించాలంటూ సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు కోరారు. వీర రాఘవులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు యందు విస్తృతంగా ప్రచారం చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలో శుక్రవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, వివిధ అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జయరాం కృష్ణ, శ్రీనివాస్ తదితరులు నాయకత్వం వహించారు.

పోస్టల్ జేఏసీ నిరసన



తణుకు హెడ్‌పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న పోస్టల్ జేఏసీ నాయకులు

తణుకు అర్బన్: తపాలా శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా స్థాయిలో పోస్టల్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం తణుకు హెడ్ పోస్టాఫీసు ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఈనెల 11వ తేదీన రెండోసారి డిపార్టుమెంట్‌కి 13 అంశాలతో కూడిన నోటీసును ఇచ్చామని చెప్పారు. వచ్చేనెల 18 నుంచి నిరవధిక సమ్మెకు దిగాలని నిర్ణయించినట్లు చెప్పారు.

సైనికులను స్మరించుకుంటూ సన్మానం



ఉప్పరగూడెం గ్రామంలో మాజీ సైనికులను సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పుల్వామా దాడిలో మృతి చెందిన సైనికులను స్మరించుకుంటూ ప్రతీ ఏటా సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఉప్పరగూడెం గ్రామ సర్పంచ్ దండే కనకబాబు అన్నారు. బెరాక చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో ఏడుగురు మాజీ సైనికులను సన్మానించారు. ఈ సందర్భంగా కనకబాబు మాట్లాడుతూ 2019వ ఏడాది నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రతీ ఏటా తమ గ్రామంలోని సైనికులను సన్మానించుకునే వారమని, ఈ ఏడాది మాధవరం మాజీ సైనికులను కూడా సన్మానిస్తున్నట్లు వివరించారు. అనంతరం మాజీ సైనికులు బొల్లం వీరయ్య, గోపిశెట్టి భరతుడు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, మరపట్ల గడ్డియ్య, మరపట్ల నాగేశ్వరరావు, రాపాక నాగరాజు, వేదాల ప్రసాద్‌లను సన్మానించారు. తొలుత పాస్టర్ కరుణాకర్ మృతి చెందిన సైనికుల కుటుంబాలకు మానసిక స్థైర్యం కలగాలని ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెరాక చర్చి యువకులు, సంఘస్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సంజీవయ్య



సంజీవయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

పెంటపాడు: నిజాయితీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని ఎంపీడీవో సీహెచ్ బాలాజీ వెంకటరమణ పేర్కొన్నారు. పెంటపాడు మండల కార్యాలయ ఆవరణలోని వీణెం వీరన్న ఆడిటోరియంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య జయంతి వేడుకలు వైఎస్సార్ టీఎఫ్ మండల అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాశాఖాధికారుల సంఘ రాష్ట్ర నాయకులు టీవీ రామకృష్ణ, పీతల సత్యనారాయణ, మండల పరిషత్ ఏవో టీవీ సత్యనారాయణ, సీతారామరాజు, సతీష్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు అభివృద్ధి చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు

పెనుగొండ: అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన రంగం వైపు మళ్లి వాటిని అభివృద్ధి చేసుకోవాలని పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు అన్నారు. శుక్రవారం కళాశాలలో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి సదస్సులో పాల్గొన్నారు. రాబోతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించి వారి భావితరాలకు మంచి బాటలు వేయాలన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ జువాలజీ విభాగ అచార్యులు మట్టారెడ్డి జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై అవగాహన కల్పించారు. భారత విద్యా మంత్రిత్వ శాఖ ఆదీనంలో ఈ సంస్థ నడుస్తుందని, మంచి విద్యా సంస్థలను గుర్తించి నాణ్యమైన విద్యనందించడానికి విశేష కృషి చేస్తుందన్నారు. సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధిక ఎరువుల వినియోగంతో అనర్థం

- భూసారానికి తీవ్ర నష్టం
- చీడపీడల వ్యాప్తికి దోహదం
- ప్రజారోగ్యానికి చేటు



ఏపుగా పెరుగుతున్న దాళ్వా వరి చేను

ఇరగవరం: చేనుకు చేవ, రైతుకు రొక్కం, మా ఎరువునే వాడండి. ఇది అందరికీ సుపరిచితమైన ఒక ప్రముఖ ఎరువుల కంపెనీ వ్యాపార నినాదం. అయితే ఎరువుల వాడకం కూడా పరిమితికి మించితే కలిగే నష్టం కూడా ఎక్కువే. ఎరువుల వినియోగంలో తగిన జాగ్రత్తలు తీసుకొని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడితో పాటు, పెట్టుబడి వ్యయం కూడా తగ్గించుకోవచ్చునని రైతులకు వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. రబీ సాగులో ఎరువులు ముఖ్యంగా నత్రజని ఎరువులను సిఫార్సు మేరకే వాడాలని, అధికంగా నత్రజని వాడటం వల్ల నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు.

తణుకు నియోజకవర్గంలో 48,883 ఎకరాల్లో రబీ సాగు
తణుకు నియోజకవర్గంలో సుమారు 48,883 ఎకరాల్లో రబీ వరిసాగు జరుగుతుండగా, ఇరగవరం మండలంలో సుమారు 11,713 ఎకరాల్లో రబీ వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే వరినాట్లు పూర్తయ్యాయి. ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పటికే మొదటి విడత ఎరువులు వేయడం పూర్తి చేసి రెండో విడత ఎరువులు వేయడానికి సన్నద్ధమవుతున్నారు. రైతులు ముఖ్యంగా వరి మొక్కల ఎదుగుదలకు అవసరమైన నత్రజనిని అందించే యూరియా ఎరువులను అధికంగా వాడుతున్నారు. చాలామంది రైతులు అవగాహనా లోపంతో అవసరానికి మించి అధికంగా యూరియా వాడుతూ నష్టపోతున్నారు. నత్రజని ఎరువు అధికంగా వాడటంవల్ల పంటలపై చీడపీడలు ఎక్కువగా ఆశించే అవకాశం ఉంటుంది. తెగుళ్లు ఆశిస్తే రైతులు పురుగు మందులకు ఎక్కువగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వరిలో కొన్నేళ్లుగా ఎండాకు తెగులు ఆశించడంతో రైతులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఇందుకు నత్రజని ఎరువుల అధిక వాడకమే కారణమని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు నిర్ధారిస్తున్నారు.

పరిమితికి మించి ఎరువుల వినియోగంతో నష్టాలివీ
- వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకే ఎరువులు వాడాలి
- నత్రజని ఎరువుల అధిక వాడకం వల్ల భూసారం దెబ్బ తింటుంది.
- పంటలపై చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. పెట్టుబడులు పెరుగుతాయి. నీటి వినియోగం పెరుగుతుంది.
- పంట దిగుబడి తగ్గుతుంది. పంట నాణ్యత కోల్పోతుంది.
- పైరు త్వరగా ఎదిగి కొద్దిపాటి గాలికే పడిపోతుంది.
- వాతావరణ కాలుష్యం పెరుగుతుంది.
- ఎండాకుతెగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఎరువుల వినియోగంపై అవగాహన



కొన్నేళ్లుగా రైతులు అవసరం మేరకే ఎరువులు వాడుతున్నారు. ఎరువులు అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన వచ్చింది. రబీ పైరుకు నత్రజని ఎరువు (యూరియా) సుమారు80కిలోలు, మూడు సమభాగాలుగా మూడు దఫాలుగా వేయాలి. సూపర్ సింగిల్ పాస్ఫేటు 100 కిలోల ఆఖరి దమ్ములో వేయాలి. పోటాష్ 40 కిలోలు రెండు దఫాలుగా వేయాలి. కాంప్లెక్స్ ఎరువులు (భాస్వరం) పైపాటుగా వేయవద్దు, అలా వేస్తే మొక్కలు గ్రహించవు. యూరియాను వేసే ముందుకు నీటిని తీసివేసి బురద పదునులో వేయాలి. 48 గంటల తర్వాత నీరు పెట్టాలి. నత్రజనితో పాటు కలుపు మందులు కలపరాదు.
– మండల వ్యవసాయ అధికారి, రాఘవేంద్ర

చెరువు పనుల నిలిపివేత

ఉండి: మండలంలోని కోలమూరు గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన చెరువు రిపేర్ పనులను శుక్రవారం అధికారులు అడ్డుకున్నట్లు ఎఫ్‌డీఓ రాంబాబు తెలిపారు. గ్రామంలోని ఓఎన్‌జీసీ రోడ్డును ఆనుకుని అల్లూరి శ్రీనివాసరాజు, పీత వెంకట్రావు అనే రైతుల చేపట్టిన చెరువు రిపేరు పనులు నిబంధనలకు విరుద్ధంగా ఉండడంతో వాటిని రెవెన్యూ, ఇరిగేషన్, మత్స్యశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటిని వాటిని నిలిపేశామని ఎఫ్‌డీఓ తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎఫ్‌డీఓ తెలిపారు.